ప్రజాశక్తి
సోమవారం 3 ఏప్రిల్ 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల






మాట్లాడుతున్న బాలినేని

25 వేల మందికి

మే మొదటి వారంలో ఇళ్లపట్టాలు

- మేం తలచుకుంటే టిడిపిలో మిగిలేది ఆ ఇద్దరే..
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి
- డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా వచ్చే నెల మొదటివారంలో ఒంగోలు నగరంలో 25 వేల మంది పేదలకు సిఎం చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆసరా మూడో విడత సంబరాల్లో భాగంగా నగరంలోని 2848 స్వయం సహాయక సంఘాల్లో ఉన్న 27,581 మంది సభ్యులకు రూ.24.23 కోట్ల విలువైన రుణమాఫీ చెక్కులను ఆదివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో సభ నిర్వహించారు. సభకు నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే మహిళలకు చెక్కుల పంపిణీ చేసి.. మాట్లాడారు. ఒంగోలులో పేదలకు పట్టాలు ఇచ్చే విషయంలో కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు రాజకీయం చేశారని విమర్శించారు. తాను 25 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు ఎంపిక చేసిన స్థలాన్ని కోర్టులో వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తాను సిఎం దృష్టికి తీసుకెళ్లానని, ఆ స్థలం కోర్టులో ఉన్నందున మరెక్కడైనా స్థలం కొనుగోలు చేసి పట్టాలు ఇవ్వాలని సిఎం చెప్పారని వివరించారు. స్థలాల కోనుగోలు కోసం సిఎం రూ.200 కోట్లు నిధులు కూడా మంజూరు చేశారని చెప్పారు. ఈ నెలలో స్థలాల కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని, వచ్చే నెల మొదటి వారంలో సిఎం చేతులమీదుగా పట్టాలు ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. ఒంగోలులో సొంతిల్లు లేని పేదలంటూ ఉండకూడదని బాలినేని ఉద్ఘాటించారు. ఒంగోలులో రోజు తాగు నీరు ఇచ్చేందుకు కూడా ▶ 2లో

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 175 కేంద్రాల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి జిల్లాలోని 175 కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు మొత్తం 28,902 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 14,830 మంది, బాలికలు 14072 మంది ఉన్నారు. పదో తరగతి పరీక్షల కోసం 1600 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితో పాటు 175 చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమితులయ్యారు. పదో తరగతి పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్, 30 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాలలో అవసరమైన ఫర్నీచర్, లైటింగ్, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.


కోవిడ్-19 తరువాత రెండో సంవత్సరం జరుగుతున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రైవేట్‌కు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పెద్దఎత్తున కసరత్తు చేశారు. స్లో లెర్నర్స్‌కు ప్రత్యేక తరగతులు నిర్వహించటంతో పాటు స్లిప్ టెస్టులు, సడన్ సర్‌ప్రైస్ టెస్టులు నిర్వహించారు. విద్యార్థులకు రివిజన్స్ చేయటంతో పాటు వారు ఏయే సబ్జెక్టులలో తప్పులు చేశారో వాటిని సరిదిద్దే ప్రయత్నం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ప్రతి విద్యార్థి పరీక్షలలో విజయం సాధించటమే లక్ష్యంతో పాఠ్య బోధన సాగింది.

పరీక్షలకు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు

ఒంగోలు క్రైం: జిల్లాలో పదో తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి మలికా గార్గ్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తామని, జిరాక్స్ సెంటర్లు మూసివేయిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలకు ఎలాంటి స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు, పరీక్షకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతర సిబ్బంది గానీ, వ్యక్తులు గానీ ఉండరాదన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 3 నుంచి ఏప్రిల్ 18 వరకు ప్రతి రోజూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం12.45 గంటల వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ఠ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఒంగోలు సబ్ డివిజన్‌కు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, మార్కాపురం,దర్శి సబ్ డివిజన్ లకు అడిషనల్ ఎస్పీ (క్రైమ్) యస్.వి శ్రీధర్‌రావు మరియు కనిగిరి సబ్ డివిజన్ కు ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు ప్రత్యేకంగా నియమించామన్నారు.

టిక్కెట్లపై స్పష్టత వచ్చేనా.?

- నేడు ఎమ్మెల్యేలు, పార్టీ కీలక నేతలతో సిఎం జగన్ సమీక్ష
- ఎమ్మెల్సీ ఎన్నికలు, గడపగడపకూ కార్యక్రమాలే ఎజెండా



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒక వైపు ముందస్తు ఎన్నికల ప్రచారాలు.. మరో వైపు ప్రస్తుత పరిస్థితులపై అంతర్మథనాలు.. సర్వేలపై సర్వేలు చేయిస్తూ జనంలో ఎలా ఉన్నామనే అంచనాలపై అధ్యయనాలు.. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా సిద్ధంగా ఉండాలనే సంకేతాలు.. ప్రస్తుతం రాజకీయ పార్టీల్లో హాట్‌టాపిక్‌గా మారిన అంశాలుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యేలుగా గెలవాలంటే గెలుపు గుర్రాలను ఎంచుకోవాల్సిన సమయం కూడా ఆసన్నమైంది. పాలకపక్షంలో అనేక చోట్ల అభ్యర్థులపై స్పష్టత రాలేదు. పోటీకి ఎవరుంటారో అనేదానిపై క్యాడర్‌లోనే అయోమయం నెలకొంది.

సోమవారం నాడు సిఎం జగన్ తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, పరిశీలకులుగా ఉన్న ముఖ్యనేతలతో సమీక్ష చేయనున్నారు. ఎజెండాలో మాత్రం ఎమ్మెల్సీ ఎన్నికలు, గడపగడపకూ కార్యక్రమాలే ఉన్నాయి. ఈ భేటీలో టిక్కెట్లపై స్పష్టత వస్తుందనే ఆశతో చాలామంది ఎదురుచూస్తున్నారు. సమీక్షలు సాధారణంగా జరిగేవేనంటున్నారు. అభ్యర్థుల వ్యవహారంపైనే ప్రస్తుతం ఉత్కంఠగా చర్చ సాగుతోంది. ఎందుకంటే మార్చి నాటికి నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంపై ఓ స్పష్టత ఇస్తామని గతంలో ఎమ్మెల్యేలతో జరిగిన సమీక్షలో సిఎం జగన్ సూత్రప్రాయంగా వెల్లడించారు. పనితీరు ఆధారంగానే టిక్కెట్టు ఉంటాయని చెప్పారని నాయకులు గుర్తు చేస్తున్నారు. ఏదేమైనా ఈ సమీక్ష కీలకంగా మారింది. ఎందుకంటే ఇప్పటివరకూ జరిగిన సమీక్షలకు ముందున్న పరిస్థితులు, పరిణామాలు ఇప్పుడు భిన్నంగా ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల విషయానికే వస్తే ఇప్పటివరకూ జరిగిన అన్ని రకాల ఎన్నికల్లో పోటీ సరిగా లేనందున వైసిపి క్లీన్‌స్వీప్ చేసింది. అయితే తెలుగుదేశం నుంచి సరైన పోటీ లేదు. కారణాలు అనేకం ఉన్నాయి. ఆర్థికంగా నష్టపోతామనే భావనతో స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి పెద్దగా పోటీ లేదు. సర్పంచుల విషయంలోనూ ఇదే జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి పరిస్థితి మారింది. తెలుగుదేశం పట్టభద్రుల ఎమ్మెల్సీ కైవసం చేసుకుంది. ఇదే వైసిపికి ఆందోళన కలిగించింది. ఇప్పుడు జనంలో ఎలా ఉన్నామనే దానిపైనే చర్చంతా నడుస్తోంది. నెల్లూరు జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీని వీడారు. ఇవి కూడా పార్టీకి నష్టంగా మారాయి. ఎమ్మెల్సీ ఓటమిపైనా ప్రభావం చూపాయి. మొత్తంగా మూడు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు పాలకపక్షానికి దిమ్మ తిరిగేలా చేశాయి. వీటిపైనే ఎక్కువ చర్చ ఉంటుందని భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిపైనే సమీక్ష ఉంటుందని భావిస్తున్నారు. రెండోది గడపగడపకూ కార్యక్రమం. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రక్రియ ప్రారంభమయ్యాక దీనిపై ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు దృష్టి తగ్గించారు. కోడ్ కూడా ఆటంకంగా మారింది. దీంతో ఎవరూ పెద్దగా తిరగలేదు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శనివారం నాడు మళ్లీ ప్రారంభించారు. మిగతా ఎమ్మెల్యేలు పెద్దగా కనిపించడం లేదు. ఇక ఎమ్మెల్యేలు, ఆశావహులు ఎదురుచూస్తున్న అంశం టిక్కెట్లపై స్పష్టత. జిల్లాలో ఒంగోలు, వైపాలెం మినహా మిగతా నియోజకవర్గాల్లో ఎవరికీ టిక్కెట్లపై గ్యారంటీ లేదు. ఎవరికివారే ప్రయత్నాల్లో ఉన్నారు. అందరూ సిఎం జగన్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. కనిగిరి, గిద్దలూరు, దర్శి, మార్కాపురం, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో సిట్టింగులకు పోటీగా టిక్కెట్ల కోసం చాలామంది రేసులో ఉన్నారు. కొండపిలో ▶ 2లో

మాదక ద్రవ్యాల కేసులో

ఇద్దరిపై పీడీ చట్టం

రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించినా, విక్రయించినా, రవాణా చేసినా ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించేది లేదని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లాలో పలు మాదకద్రవ్యాల కేసులలో ముద్దాయిలుగా వుండి పోలీసుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి వారి నేరప్రవత్తి మార్చుకోని అంగడి చంద్రబాబు అలియాస్ చంద్ర, అన్నారెడ్డి హైమావతిపై పీడీ చట్టం ప్రయోగించి ఆదివారం జిల్లా పోలీస్ అధికారులు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. వెదుళ్ళపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టూవర్టుపురం గ్రామానికి చెందిన అంగడి చంద్రబాబుపై ఇంకొల్లు, చీరాల 1టౌన్, బాపట్ల రూరల్ పోలీస్‌స్టేషన్‌లలో పలు గంజాయి సంబంధిత కేసులలో ముద్దాయిగా ఉన్నాడు.

చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈపురుపాలెం గ్రామంలో నివాసం ఉండే అన్నారెడ్డి హైమావతిపై చీరాల రూరల్, బాపట్ల రూరల్ పోలీస్‌స్టేషన్‌లలో పలు గంజాయి సంబంధిత కేసులున్నాయి. జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ విజయకృష్ణన్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు అంగడి చంద్రబాబు, అన్నారెడ్డి హైమావతిపై పీడీ చట్టం అమలు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ పరంగా మాదక ద్రవ్యాలను జిల్లాలో పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా మాదకద్రవ్యాలను కలిగి ఉన్న విక్రయిస్తున్న లేదా సేవిస్తున్నారన్న సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లేదా ఎస్పీ బాపట్ల హెల్ప్ లైన్ నెంబర్ 8333813228కు, యస్.ఇ.బి టోల్ ఫ్రీ నెంబర్ 14500కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

మే మొదటి వారంలో ఇళ్లపట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం రూ.350 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. రానున్న ఏడు, ఎనిమిది మాసాలలో నగరంలో కొత్త తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసి.. రోజూ తాగునీటి సరఫరాకు శ్రీకారం చుడతామని చెప్పారు. పేదలెవరైనా ఇబ్బందుల్లో ఉంటే నేరుగా వచ్చి తనను కలవాలని, వారికి సహాయం చేసేందుకు తాను ఎప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, నగర డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, మెప్మా పీడీ టి.రవికుమార్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కొండయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు, యనమల నాగరాజు, తాడి కృష్ణలత, వైసిపి నాయకులు కటారి శంకర్, తమ్మినేని మాధవి, తదితరులు పాల్గొన్నారు.

మేం తలచుకుంటే..

వైసిపికి చెందిన 45 మంది ఎమ్మెల్యేలు తమకు టచ్‌లో ఉన్నారని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఒంగోలులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబుతో 45 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉంటే ఎంఎల్‌సి ఎన్నికల్లో ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలను ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. తాము తలచుకుంటే, టిడిపి వాళ్లను తమ పార్టీలోకి తెచ్చుకోదలిస్తే టిడిపిలో చంద్రబాబు, అచ్చెన్నాయుడు తప్ప ఎవరూ మిగలరని స్పష్టం చేశారు. టిడిపిలో ఆ ఇద్దరే మిగులుతారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తాయని, మంత్రివర్గ విస్తరణ ఉంటుందని జరిగే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అదంతా మీడియా సృష్టేనని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పాలన పట్ల ఎమ్మెల్యేలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు.

టిక్కెట్లపై స్పష్టత వచ్చేనా.?

(మొదటిపేజీ తరువాయి)

అసమ్మతులు తారాస్థాయికి చేరాయి. దీంతో అందరిలోనూ టిక్కెట్లపైనే అయోమయం నెలకొంది. నియోజకవర్గాల్లో గ్రూపులు పెరిగాయి. అసంతృప్తులు తీవ్రమవుతున్నాయి. కారణం నాయకత్వంపై తిరుగుబాట్లు పెరగడమే.. ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగానూ ద్వితీయశ్రేణి నేతలు ఏదో రూపంలో తమ అసమ్మతిని తెలియ జేస్తున్నారు. పార్టీలో నియంత్రణ లోపించిందనడానికి ఈ పరిణామాలు కారణాలుగా కనిపిస్తున్నాయి. ఏదేమైనా సిఎం జగన్ నిర్వహిస్తోన్న సమీక్షకు ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరవుతున్నారు.



మనోహర్‌ను సన్మానిస్తున్న అబ్దుల్ గఫార్

టెన్నిస్ క్రీడాకారుడికి సన్మానం

ప్రజాశక్తి-కనిగిరి

నరసరావుపేటలో ఇటీవల నిర్వహించిన లాన్ టెన్నిస్ పోటీలలో కనిగిరి కాస్మోపాలిటిన్‌క్లబ్ సీనియర్ సభ్యులు కోటపాటి మనోహర్ ప్రతిభ చూపి ప్రథమ బహుమతిని సాధించాడు. ఈ సందర్భంగా మనోహర్‌ను మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ఆదివారం సన్మానించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మనిషికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, సమ్యుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, లాన్ టెన్నిస్ జిల్లా జాయింట్ సెక్రటరీ అల్లూరి సత్యనారాయణ,సభ్యులు రంగబాబు,ప్రకాశ్‌రావు, ప్రసాద్‌రావు, టెన్నిస్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా టిడిపి ప్రభ తరలింపు

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని రామతీర్థం తిరునాళ్ల ఈనెల5న నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా టిడిపి ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రభను హరహరక్షేత్రం సెంటర్ నుంచి రామతీర్థంకు ఆదివారం తరలించారు. ఈ సందర్భంగా ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్లజనార్ధన్, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు గుర్రాలపై స్వారీ చేస్తూ కార్యకర్తలలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చారు. తీన్‌మోర్, తప్పెట్లు, వీరతాళ్ళు, డిజె సౌండులతో చీమకుర్తి ప్రధానవీధి మారు మ్రోగింది. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య, గొల్లపూడి సుబ్బారావు, జి.రాఘవరావు, వేల్పుల శ్రీను, శేషయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, కందిమళ్ళ గంగాధరరావు, కౌత్రపు రాఘవరావు, రావిపాటి రాంబాబు, చలమయ్య, పునాటి వెంకటరావు పాల్గొన్నారు.



విద్యుత్ ప్రభ తరలిపులో దామచర్ల, విజయ్‌కుమార్

ఓటర్ల నమోదుపై సమీక్ష

మద్దిపాడు : ఓటర్ల నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి దొంగ ఓట్లను గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు మండల జయంత్‌బాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఓటర్ల నమోదుపై మండల జయంత్ బాబు అధ్యక్షతన సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పి. అజయ్ కుమార్ మాట్లాడుతూ కస్టర్ ఇన్‌ఛార్జుల నియామకాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవభక్తి ప్రసాద్, ఎం. గోపి చంద్, వెల్లంపల్లి ఎంటిటిసి అద్దేపల్లి భవానీ, చింతల శ్రీనివాసరావు, రావి ఉమా మహేశ్వరరావు, సుద్దపల్లి సుబ్బారావు, అనిల్ కుమార్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి విరాళం అందజేత

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ శ్రీవరహాలక్ష్మి నరసింహస్వామి దేవస్థానానికి దిగువనున్న తాతయ్య స్వామి ఆలయం లోని ధ్వజస్తంభం పూర్తిగా ధ్వంస మైంది. దీంతో నూతన ధ్వజ స్తంభం పున:నిర్మాణం కోసం తెనాలికి చెందిన దాత దాసరి శ్రీకష్ణ కుమార్ రూ.7 లక్షల విరాళం అంద జేసేందుకు ముందుకొచ్చినట్లు శ్రీవరహాలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవ రావు, ప్రధాన అర్చకుడు ఉదయగిరి లక్ష్మి నరసింహ చార్యులు తెలిపారు. దాత ఆదివారం శింగరాయకొండ వచ్చి విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు అభినందనలు తెలిపారు. దాతల సహకారంతో దేవస్థానాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు.



దాతలను అభినందిస్తున్న ఆలయ చైర్మన్

సిఐ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి సిఐగా కెవి. రాఘవేంద్ర బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, పుర ప్రముఖులు సిఐని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిఐకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి నాయకులు గొలమారి చెన్నారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, మాదాలవాపాలెం పిఎసిఎస్ అధ్యక్షులు కొత్తపులి బ్రహ్మారెడ్డి, సర్పంచుల సంఘం నాయకుడు పేరం కోదండ రామిరెడ్డి, అంబవరపు నారాయణ రెడ్డి, సిసికెఆర్ శ్రీనివాస రెడ్డి, ఉద్యోగ సంఘం నాయకులు గూడూరి వినోద్ కుమార్, ఫిరోజ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జిసి.సుబ్బారావు, సెక్రటరీ వేమా కష్ణమూర్తి, ట్రెజరర్ కంకణాల రమేష్, ఆర్యవైశ్య సంఘం మండల సెక్రటరీ సామి రాజా, ఒగ్గు వెంకట్రామయ్య, వల్లంకొండ వెంకట సుబ్బారావు తదితరులు ఉన్నారు.

రమేష్‌కు డాక్టర్ మాదాసి నివాళి

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయతీ పరిధిలోని పోతయ్యపాలెంకు చెందిన వైసిపి కార్యకర్త వాయిల రమేష్ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి నాయకులు రమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. మృతుడు రమేష్ తొలి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నాడు. వైస్ జగన్‌పై అభిమానం ప్రస్తుతం వైసిపిలో కొనసాగుతున్నారు. రమేష్‌కు నివాళులర్పించిన వారిలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న డాక్టర్ వెంకయ్య

సిసిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కనిగిరి

మండల పరిధిలోని ఏరువారి పల్లి పంచా యతీ అభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచి దమ్ము వెంకటయ్య తెలిపారు. గ్రామంలోని అంకాళమ్మ దేవస్థానం వద్ద సిసి రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడతూ ఏరువారిపల్లి గ్రామ పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, ఎంపిటిసి రమణారెడ్డి, ఆదినారాయణ, వై. చినబాబు, .వెంకటరెడ్డి, వి.కొండారెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.



శంస్థాపనలో సర్పంచి వెంకటయ్య

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికాబద్ధమైన కృషి

ప్రజాశక్తి-వెలిగండ్ల

ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. నూరు శాతం సాధించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నారు. విద్యార్థి దశలో తొలి పబ్లిక్ పరీక్షలు 10వ తరగతితోనే ప్రారంభమవుతాయి. విద్యార్థి భవిష్యత్తు కూడా ఈ పరీక్షలపైనే ఆధారపడి ఉంటుంది. తొలి పబ్లిక్ పరీక్షలు కావడంతో విద్యార్థులు ఒత్తిడికి గురికావడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో విద్యార్థులు కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు.

వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 29 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పదో తరగతిలో ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియంలలో మొత్తం 126 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో వెనుకబడిన వారి విభజించి వారికి రోజువారిగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆదివారం, సెలవు రోజులతో కలిపి ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల పాటు అదనపు తరగతులు నిర్వహిస్తూ వారి సందేహాలను తీర్చుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు చింతా విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. అంతేకాక ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొని సలహాలు, సూచనలు ఇస్తూ ప్రణాళికాబద్ధంగా చదివించడం ద్వారా ప్రతి సంవత్సరం



స్టడీ అవర్స్‌లో చదువుతున్న విద్యార్థులు

100శాతం ఫలితాలతోపాటు ప్రతి ఏడాది ఐదారుమంది ట్రిబుల్ ఐటిలో స్థానం సాధిస్తున్నట్లు తెలిపారు.

సందేహాలు తీరుతున్నాయి

సోము చైతన్యలక్ష్మి, 10వ తరగతి విద్యార్థి, ఇంగ్లీష్ మీడియం

పాఠాల్లో సందేహాలు కలిగినప్పుడు వాటిని పాఠశాల సమయం ముగిసిన తరువాత నిర్వహించే స్టడీ అవర్స్‌లో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాము. ఇంటికి వెళ్లి ఎటువంటి ట్యూషన్లు లేకుండా అర్థవంతంగా చదువుకోగలుగుతున్నాము. ఈ పరీక్షల్లో 585కు పైగా మార్కులు సాధిస్తానని ధీమాగా ఉంది.

ప్రణాళిక ప్రకారం చదువుకుంటున్నాం

కె హేమచంద్, 10వ తరగతి విద్యార్థి, ఇంగ్లీష్ మీడియం

ఈ ఏడాది 6 పేపర్లు కావడం, అందులో సైన్స్ పేపర్ పార్ట్-ఎలో భౌతిక రసాయనిక శాస్త్రాలు, పార్ట్-బిలో జీవశాస్త్రం ఉండడంతో 3:15 గంటల సమయంలో పరీక్ష నిర్వహిస్తున్నారు. గతంలో రెండు పేపర్ల విధానం ఉండే సమయంలో ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేవారు. ప్రస్తుతం రెండు పేపర్లు కలిపి ఒకే రోజు పరీక్ష నిర్వహించడం వలన పరీక్ష రాసేందుకు సమయం సరిపోదు. అందుకు సమయాన్ని ప్రణాళికాయుతంగా మార్చుకొని పరీక్షలు అంటే భయం లేకుండా ఉపాధ్యాయుల తర్ఫీదు పొందాము.

స్టడీ అవర్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి

పి శివభారతి, 10వ తరగతి, తెలుగు మీడియం

ప్రతి రోజు ఉపాధ్యాయులు నిర్వహించే స్టడీ అవర్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఉదయం, సాయంత్రం సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నేను మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకొస్తాను.

ఒత్తిడి లేకుండా చదువు

టి గ్రేసి, 10వ తరగతి విద్యార్థి, ఇంగ్లీష్ మీడియం

ఉపాధ్యాయులు తమపై ఒత్తిడి లేకుండా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేక పరీక్షలు నిర్వహించి తమ సామర్థ్యాన్ని అంచనా వేసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుంటున్నారు. పరీక్షలు సమీక్షిస్తున్న సమయంలో ప్రణాళికాబద్ధంగా సమయం వృథా కాకుండా తమపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధన చేస్తున్నాం

పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతా విజయభాస్కర్‌రెడ్డి, వెలిగండ్ల



తమ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా బోధన చేస్తున్నాం. నూరుశాతం ఉత్తీర్ణత సాధించడమే ధ్యేయంగా కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు బోధన చేస్తున్నాం. ఈ ఏడాది కూడా ట్రిబుల్ ఐటిలో ఐదారుమంది స్థానం సాధించేలా శిక్షణ ఇస్తున్నాం. ఉత్తమ ఫలితాల సాధన కోసం ఐక్యంగా శ్రమిస్తున్నాం.

విద్యార్థులను దత్తత తీసుకున్నాం

ఆవుల కృష్ణారెడ్డి, ఫిజిక్స్ ఉపాధ్యాయులు, వెలిగండ్ల హైస్కూల్



ఈ ఏడాది 126 మంది విద్యార్థులతో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నాము. ప్రతి విద్యార్థి పదో తగగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను దత్తతకు తీసుకొని వారి సందేహాలను తీర్చుతున్నాము. ఈ ఏడాది కూడా మా విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

షేక్ గౌషియాబేగం, గణిత ఉపాధ్యాయులు, వెలిగండ్ల హైస్కూల్



పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కృషి చేస్తున్నాము. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాము. ముఖ్యంగా తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి విద్యార్థులు చదువుతున్నారా లేదా అని ప్రతి రోజూ సమాచారం తెలుసుకుంటున్నాం.



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఏలూరి కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా దివంగత ఎన్టీ రామారావు, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి క్యాంపును ప్రారంభించారు. 554 మంది హాజరుకాగా 250 మందిని కంటి వైద్య శస్త్ర చికిత్సకు వైద్యులు ఎంపిక చేశారు. కంటి వైద్య శిబిరానికి హాజరైన పురుషులకు, మహిళలకు వేరువేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. క్యాంపునకు హాజరైన వారికి బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ మోనీషా, డాక్టర్ దృశ్య కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నోవా అగ్రి గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఏటుకూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రిగ్రూప్స్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరికీ కంటి చూపు అందించడమే లక్ష్యంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లక్ష మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడమే లక్ష్యంగా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు నేతత్వంలో నిరంతరం ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం కంటి వైద్య శిబిరాలతో పాటు మోకాళ్ల ఆపరేషన్లు, మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ఏలూరి రాజకీయాలకు అతీతంగా సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరికీ సేవా కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, తోండేపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, కామినేని జనార్ధన్, పెంట్యాల శరత్, చిరంజీవి, రామారావు, రమణ, మణికంఠ, పర్వతాలు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు



ఎస్ఐ కృష్ణపావని

మండలంలోని హనుమంతునిపాడు, మహమందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ కృష్ణపావని ఆదివారం తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాలకు సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, పరీక్ష సెంటర్ల వద్ద నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, పరీక్ష కేంద్రం లోపలికి స్మార్ట్‌వాచ్ గాని, మొబైల్ ఫోన్స్, ఐపాడ్, ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లరాదన్నారు. ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు.

నూతన ఆరోగ్య కేంద్ర భవనం సందర్శన

ప్రజాశక్తి-వేటపాలెం: దాదాపు రెండు కోట్లతో నిర్మించిన వేటపాలెం నూతన ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే కరణం బలరాం ఆదివారం సందర్శించారు. ఈ నెల 4వ తేదీ నూతన జిల్లా ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన వేటపాలెం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి మైనర్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. 4వ తేదీ నాటికి నూతన భవనాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి సుముఖం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎంవిఎస్ శర్మ, తహశీల్దార్ గరిక మహేశ్వరి, చీరాల ఆర్అండ్‌బి డిఇ నరశింహులు, డాక్టర్ బాలరాజు, కాంట్రాక్టర్ శ్రీహరిరావు పాల్గొన్నారు.

తీర్మానం లేకుండానే బిల్లుల చెల్లింపులా?

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఏల్చూరు గ్రామపంచాయతీకి సంబంధించి 52 లక్షల రూపాయల పనులకు గాను, 28 బిల్లులకు ఎలాంటి తీర్మానం చేయకుండానే, ఆ గ్రామపంచాయతీ అధికారులు బిల్లులు ఎలా చెల్లించారని ఎంపీటీసీ సభ్యులు ఓరుగంటి కోటిరెడ్డి ఎంపీడీవో ఎం సాంబశివరావును నిలదీశారు. మండల పరిషత్ సమావేశం హాలులో ఆదివారం ఎంపీపీ ఎనుబర్ల యలమంద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇప్పటికీ ఏల్చూరు గ్రామంలో నాలుగు బృందాలుగా ఉన్నతాధికారులు విచారణ జరిపినా, సంబంధి త అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కోటిరెడ్డి ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటివరకు సాధారణ ఫండ్ కింద చేసిన రెండు కోట్ల రూపాయల పనులకు బిల్లులు చెల్లించకుండానే, మళ్లీ రూ.కోటి 80 లక్షలకు తీర్మానాలు చేయడం ఏమిటని కోటిరెడ్డి ఎంపీడీవోను ప్రశ్నించారు. దీంతో సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. జగనన్న బడుగు వికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు మంజూరయ్యే సబ్సిడీ రుణాలను, వెలుగు అధికారులే బ్యాంకు మేనేజర్లతో మాట్లాడి మంజూరు చేయించాలన్నారు. ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులు రీ షెడ్యూల్ చెల్లించడంలో జాప్యం చేస్తుంటారని బ్యాంకు మేనేజర్లు ఆరోపిస్తూ ఉండటంతో, సభ్యులు తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. వెల్లలచెరువు గ్రామంలో వీధి కుక్కల దాడిలో పిల్లలు, వృద్ధులు తీవ్రగాయాల



సంతమాగులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆరోపిస్తున్న ఎంపిటిసి

పాలవుతున్నారని, కుక్కలను పట్టుకొని కట్టడి చేయాలని, ఆలూరి శ్రీనివాసరావు అధికారులకు తెలియజేశారు. సంతమాగులూరు నుంచి చిలకలూరిపేటకు పోయే రహదారి, కొమ్మాలపాడు గ్రామం నుంచి పరిటాల వారి పాలెం వరకు పోయే ఆర్అండ్‌బి రహదారి, సంతమాగులూరు నుంచి బల్లికురవ వరకు పోయే రహదారి గుంతలుగా ఏర్పడి అధ్వానంగా ఉందని, వెంటనే నిర్మాణాలు చేపట్టాలని ఈ సమావేశంలో పాల్గొన్న ఆర్అండ్‌బి అధికారులకు సభ్యులు విన్నవించారు. మండలంలో ఇంకా 1400 మంది రైతులు ఈ కేవైసీలో నమోదు కాలేదని, ఏప్రిల్ నెల ఆఖరిలోపు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు అశోక్‌వర్ధన్, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు బలవన్మరణం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కృష్ణ పావని

హనుమంతునిపాడు మండలం దొడ్డిచింతల గ్రామానికి చెందిన పరిశపోగు రవితేజ(21) అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దొడ్డిచింతల గ్రామం ఎస్సీ కాలనీలో అమ్మమ్మ గారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణపావని హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని యువకుని మృతదేహం కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ కృష్ణపావని, స్థానికుల కథనం ప్రకారం.. దొడ్డిచింతల గ్రామంలో నివాసముంటున్న పరిశపోగు నెహెమియాకు ముగ్గురు కుమారులు కాగా వారిలో రెండో కుమారుడైన రవితేజ.. ఇద్దరు పిల్లలన్న తల్లితో ప్రేమాయణం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఆమెను తన అత్తగారి ఇంటి నుంచి తీసుకొని వెళ్లాడు. ఈ క్రమంలో ఆమె తల్లిదండ్రులు కనిగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వారిద్దరినీ వెతికి పట్టుకొని తల్లిదండ్రులకు అప్పజెప్పారు. రవితేజ గతంలో కూడా రెండు పర్యాయాలు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై, తరచూ కుటుంబంలో గొడవలకు దిగేవాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు మందలించడంతో రవితేజ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ కృష్ణపావని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం: త్రిపురాంతకం మండలం మేడపి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వి చంద్రమౌళి(55) స్థానికంగా ఉండే ఓ బేకరిలో పని చేసేందుకు నెల రోజుల క్రితం మేడపి వచ్చాడు. శనివారం ఉదయం బేకరికి వచ్చే క్రమంలో మేడపి బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం బస్సు కిందికి వెళ్లడంతో చంద్రమౌళికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.



జడ శ్రావణ్ కుమార్‌తో జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు గోవాడ శ్రీకాంత్

'చింతామణి'పై నిషేధం త్వరలోనే రద్దు

ప్రజాశక్తి-అద్దంకి: జీవో నెంబర్ 7 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చింతామణి నాటక ప్రదర్శనను నిషేధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నరసాపురం పార్లమెంట్ సభ్యులు ఎంపీ రఘురామకృష్ణంరాజు, ప్రముఖ మాజీ న్యాయమూర్తి అయిన జడ శ్రావణ్ కుమార్‌చే కళాకారుల తరపున హైకోర్టులో వాదన వినిపిస్తున్నారు. అద్దంకి నాట్యమండలి, బాపట్ల జిల్లా కళాకారుల సంఘం తరపున అధ్యక్షులు గోవాడ శ్రీకాంత్ విజయవాడలో జడ శ్రావణ్ కుమార్ వారి క్యాంప్ ఆఫీస్‌లో కళాకారులతో మర్యాదపూర్వకంగా కలిశారు. చింతామణిపై విధించిన నిషేధం ఈ నెలాఖరుకి హైకోర్టు న్యాయస్థానం వారు కళాకారులు అనుకూలంగా తీర్పు వస్తుందని కళాకారులతో జడ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వంజా సుబ్బారావు, చేబ్రోలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నాపంతుల జగన్నాథరావు

గ్రామీణుల కథల సమాహారమే ఆంధ్రగాథాలహరి

ప్రజాశక్తి-అద్దంకి: భక్తి, రక్తి, భావుకతల సమ్మేళనం, కల్మషంలేని గ్రామీణ ప్రజల జీవనాన్ని ప్రతిబింబించే కథల సమాహారమే ఆంధ్రగాథాలహరి పుస్తకమని ప్రముఖ కవి ఆర్‌వి రాఘవరావు అన్నారు. సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామసుశీల నిలయంలో జరిగిన పుస్తక రచయిత డివిఎం సత్యనారాయణ అభినందన సభకు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సభా సంచాలకులుగా వ్యవహరించారు. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పద్యాలతో పాటు కథలకు పుట్టినిల్లు తెలుగునేల అని అన్నారు. తెలుగు గ్రామీణ ప్రజల జీవన విధానాన్ని, వారి మనోవ్యాపారాలను, మంచి భావుకత కలిగిన కవిత్వాన్ని ఈ పుస్తకం ద్వారా సత్యనారాయణ అందించారని పేర్కొన్నారు. ముఖ్య అతిథి, పద్యకవి అన్నాపంతుల జగన్నాథరావు మాట్లాడుతూ డివిఎం సత్యనారాయణ నడుస్తున్న శబ్దరత్నాకరం అని అభివర్ణించారు. వీరి రచనా శిల్పం అత్యద్భుతమని పేర్కొన్నారు. ఆ రచనాశిల్పం సజీవమైన మనిషిలా మనతో సంభాషిస్తుందని అన్నారు. లక్కరాజు శ్రీనివాసరావు సత్యనారాయణ రచించిన భజగోవిందం పుస్తకాన్ని పరిచయం చేశారు. శంకరాచార్యుల భజగోవిందాన్ని తెనుగుచేసి, ఆ కావ్యంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, భక్తి వైరాగ్య చింతనలను ప్రజలు సులభంగా గ్రహించేలా కవిత్వీకరించాడని అన్నారు. ధిషణ, ధార, ధారణ గల పద్యకవి సత్యనారాయణ అని, ఆయన రచనలు పండిత పామరులు మెచ్చుకునే విధంగా ఉంటాయని ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యు దేవపాలన, గాడేపల్లి దివాకర దత్తు, చుండూరి మురళీ సుధాకర్, చిన్నిమురళీకృష్ణ, కొండకావూరి కుమార్, కంఠంరాజు శివరామ కోటేశ్వరరావు, చప్పిడి వీరయ్య, కోలలపూడి శ్రీనివాస రావు, కె అనిల్‌కుమార్ సూరి, మిట్టా కామేశ్వరశర్మ, వామరాజు వెంకటేశ్వర్లు, నిమ్మరాజు నాగేశ్వర రావు, సంకా బాబు, గోపినాథం హరనాథ్, అద్దంకి లెవీప్రసాదు, మిడసల మల్లికార్జున రావు, పిసిహెచ్ కోటయ్య, మన్నం త్రిమూర్తులు, నర్రా శ్రీలక్ష్మి, అంజాద్‌బాషా, కె నాగయ్య, ధర్మవరపు శ్రావణ్, చామర్తి సత్యనారాయణ, తమ్మన శ్రీనివాసరావు, ఓరుగంటి శ్రీనివాసులు, కూరపాటి రామకోటేశ్వరరావు, లక్కరాజు విశ్వమోహన్, రాధాకృష్ణమూర్తి, ఎన్ రాఘవ తదితరులు పాల్గొన్నారు. సభానంతరం డివిఎం సత్యనారాయణ దంపతులను ఘనంగా సాహితీ మిత్రమండలి సత్కరించింది. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రియులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పదును.. నైపుణ్యానికి సాన

మార్కాపురం జిల్లా ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వ బడి అంటే చాలా మందికి చిన్నచూపు.. నాణ్యమైన విద్యనందిస్తున్నా.. అనుభవజ్ఞులైన గురువులున్నా.. పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నా.. మధ్యాహ్నం రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నా.. అక్కడ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉండదనే అపోహ తల్లిదండ్రుల్లో ఉంది.. ఇందుకు భిన్నంగా మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మెరుగైన ఫలితాలతో దూసుకుపోతోంది. ఇక్కడ చేరిన విద్యార్థులందరినీ సొంత బిడ్డల్లా భావిస్తూ గురువులు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు నూరుశాతం ఉత్తీర్ణత కోసం అవిరళ కృషి చేస్తుంటారు. అందుకే మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చేరేందుకు పోటీ పడుతుంటారు. ఆ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య 1200కు పైగా ఉంది. పదో తరగతిలో 275 మంది ఉన్నారు.

ప్రయివేటు విద్యా సంస్థలకు ధీటుగా ఉండాలని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి జరుగుతోంది. అందులో భాగంగా ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలతో పాటు అదనంగా ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో ఉపాధ్యాయ బృందం కష్టపడుతోంది. ప్రత్యేక



స్టడీలో పాల్గొన్న 10వ తరగతి విద్యార్థులు

పాఠ్య ప్రణాళిక తయారు చేసి వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టు సాధించేలా ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు సాధన చేయిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు ప్రత్యేక తరగతులతో సబ్జెక్టుల వారీగా మోడల్ టెస్టులతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి దడుపు లేకుండా చక్కగా పరీక్షలు రాయడం, మంచి ఫలితాలు సాధించడం ఎలా అనే అంశాలపై ఈపాటికే అవగాహన కల్పించారు. ఇందులో మెరికల్లాంటి విద్యార్థులను మరింతగా ప్రోత్సహిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో అల్పాహారం అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఈ ప్రయివేటు పాఠశాలలోనూ ఈ విధంగా శ్రద్ధ తీసుకోరనే చెప్పాలి. నూరు సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సరస్వతీ నిలయంగా పేరొందింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలతో గుర్తింపు లభించింది. పదో తరగతి పరీక్షల్లో ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా నూరుశాతం ఉత్తీర్ణతతో పాటు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు రావాలని ఉపాధ్యాయ బృందం తపన పడుతోంది. ఆ విధంగా కష్టపడుతోంది.

మంచి ఫలితం రావాలన్నదే మా అభిమతం
ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి



తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ద్వారా మంచి ఫలితం రావాలన్నదే తమ అభిమతమని ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖర రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాటికి నేటికీ వసతుల కల్పనతో చాలా తేడా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు ధీటుగా తయారయ్యాయన్నారు. విద్యార్థులు కూడా చదువులో రాణిస్తే... జీవితం ఉన్నతంగా ఉంటుందన్నారు. తమ వద్ద చదివిన విద్యార్థి కూడా ఉన్నతంగా ఎదగాలనేది తమ సంకల్పమని పేర్కొన్నారు. అందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని విద్యా బోధన చేపట్టామన్నారు. పరీక్షల సమయంలో అదనపు సమయం తీసుకుని ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ ఏడాది కూడా నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయ బృందం కష్టపడుతోందన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి: డిఇఒ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



డిఇఒ రామారావు

నేటి నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావు తెలిపారు. బాపట్ల జిల్లాలో మొత్తం 17,344 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. 103 పరీక్షా కేంద్రాలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు 331 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవుతున్నారు. నేటి నుంచి 18వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులను గంట ముందు నుంచి పరీక్షల కేంద్రంలోకి అనుమతిస్తారు. అలానే ఓపెన్ స్కూల్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో 10వ తరగతిలో 1,266 మంది ఇంటర్ పరిక్షలు 2,624 మంది రాస్తున్నారు. పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేస్తున్నారు. జిరాక్స్ మిషన్ల సెంటర్లను మూత వేయిస్తున్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోడానికి అవసరమైన ప్రాంతాల్లో ఆర్‌టిసి బస్సులను నడుపుతున్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ చూయించి ఆర్‌టిసి బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చు. పరీక్షలు ముగిసే వరకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు పరీక్షల కేంద్రంలోకి పెన్ను, పెన్సిల్, రబ్బరు, అట్టలను మాత్రమే తెచ్చుకోవాలి. పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఇన్విజిలేటర్లు, స్పాట్ ఆఫీసర్లను నియమించారు. బాపట్ల జిల్లాలోనే తొలిసారిగా జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించిన మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయి పరీక్షలు రాయాలని డిఇవో రామారావు కోరారు.



చెక్కును పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి

ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-చెరుకుపల్లి: హామీల అమలులో మాటతప్పని జగన్మోహన్‌రెడ్డిని మరల ఆదరించాలని రాజ్యసభ సభ్యులు వెంకటరమణారావు అన్నారు. మూడవ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ప్రసంగించారు. సంక్షేమ పథకాలతో కుటుంబ అభివృద్ధితోపాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు మత్తీ దివాకర రత్నప్రసాద్, ఎంపీడీవో బి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు పైనం ఏడుకొండలరెడ్డి, మాజీ ఎంపీపీ చెన్నూ కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి: సిపిఎం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. ఆదివారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో నుంచి నాన్ ఎక్స్‌ప్రెస్‌వే రోడ్డు దాదాపుగా నాలుగు కిలోమీటర్లు వెళుతుందని, ఇదే క్రమంలో బయట నుంచి భారీ వాహనాలు ప్రయాణం చేస్తున్నాయని అన్నారు. ఈ సమయాలలో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల కాలంలో అనేకమంది మత్యువాత పడ్డారని గుర్తు చేశారు. పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణం ట్రాఫిక్ సమస్యకు శాశ్వతమైన పరిష్కారమని పేర్కొంటూ గతంలో అనేకమంది మేధావులు, ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. రాజకీయ సంకల్పం లేకపోవడంతో ఈ బైపాస్ నిర్మాణ



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

అంశం ముందుకు సాగలేదన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితే తప్ప పట్టణ ప్రజలు కష్టాలకు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. పట్టణ పడమర వైపు నుంచి తూర్పు వైపు రోడ్డు దాటడానికి ఇప్పటికే ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా ఆయిల్ మిల్ రోడ్, ఎస్బిఐ రోడ్డులో పలు విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్ నిర్మాణాలు కాంట్రాక్టర్ ద్వారా జరుగుతున్నాయని, ఆ కాంట్రాక్టర్ పైపులైన్లు వేయడానికి గోతులు తీసి పైపులైన్లు వేసి అలానే వదిలేయడం ద్వారా ప్రధాన వీధుల్లో రోడ్లు గుంతలమయం కావడంతో పాటు నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో అంతర్గత రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయని, ఎక్కడికక్కడ మురుగునీరు పారుదల లేకుండా నిలిచి ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయన్నారు. అభివృద్ధి పేరిట రోడ్లు మరింత దారుణంగా తయారు చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. సమస్యను త్వరగా పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ప్రజాసంఘాలు, ప్రజలను కలుపుకొని పోరాటాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, పోనక రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు ఇలా..

- పరీక్షా కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వ మార్గదర్శకాలు
- విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లకు వేర్వేరుగా నియమావళి
- జిల్లాలో 175 కేంద్రాల పరిధిలో 28,902 మంది పరీక్షకు హాజరు
- నేటి పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అనేక సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీన్ని దష్టిలో ఉంచుకున్న ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలతో కూడిన నియమావళిని హాల్ టికెట్లపై ముద్రించింది. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు చేయాల్సిన, చేయకూడని పనులతో పాటు ఇన్విజిలేటర్లకు వారి విధులను నిర్దేశిస్తూ సమగ్ర వివరాలు, నిబంధనలతో కూడిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్ విడుదల చేసింది.

పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు

పదోతరగతి పరీక్షలు నేటి నుంచి ఈనెల 18 నుంచి జరగనున్నాయి. పగలు, రాత్రీ తేడా లేకుండా శ్రమిస్తున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆశిస్తున్నారు. ఆ విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపడుతోంది. విద్యార్థులు హాల్ టికెట్‌తో వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాసి వెళ్లేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా గతంలో ఎన్నడూ లేని రీతిలో విస్తతమైన ఏర్పాట్లు చేస్తోంది. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాటు చేసిన 175 కేంద్రాల పరిధిలో 28,902 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎంఇఒ తులసీ మల్లికార్జున

విద్యార్థులు పాటించాల్సినవి..

– హాల్ టికెట్‌లో ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యా శాఖాధికారుల దష్టికి తీసుకెళ్లి సరి చేయించుకోవాలి.

– ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 9.30గంటల తర్వాత పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.

– పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇచ్చే క్వశ్చన్ పేపర్‌పై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రిస్తోంది. హాల్ టికెట్లపై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నెంబరు ఆధారంగా పరీక్షా కేంద్రంలో రూములను కేటాయించి, దానికి అనుగుణంగానే విద్యార్థులను కూర్చోపెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఒఎంఆర్ షీట్లను విద్యార్థుల రోల్ నెంబరు ఆధారంగా పంపిణీ చేస్తారు.

– రోల్ నెంబరు ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తరువాత ఇన్విజిలే టర్ వచ్చి బార్ కోడింగ్‌తో కూడిన ఒఎంఆర్ షీట్, ప్రశ్నపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజే స్తారు. తదుపరి ఒఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయరాదు.

– గైర్హాజరైన విద్యార్థుల ఒఎంఆర్ షీట్లను అక్కడే ఉంచి, పరీక్ష ప్రారంభమైన తరువాత ఇన్విజిలేటర్లు వాటిని స్వాధీనం చేసుకుంటారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తరువాత, మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసే వరకు విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. గుర్తింపు కార్డు కలిగి, పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, స్క్వాడ్ బందాలను పరీక్ష కేంద్రాల్లోకి తనిఖీలకు అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు శాఖ 144 సెక్షన్ అమలు పర్చడంతో పాటు విస్తత రీతిలో బందోబస్తు ఏర్పాట్లు. చేస్తోంది.

– పరీక్ష కేంద్రంలో పక్క, పక్కన కూర్చునే ఏ ఇద్దరు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఒకే వరుస క్రమంలో ఉండవు. విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబులో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు.

– ప్రతి విద్యార్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇచ్చి, అదనంగా పేపర్లు అవసరమైతే మరొక 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ఒఎంఆర్ షీట్, ఆన్సర్ బక్లెట్‌లలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీసుగా పరిగణిస్తారు.

ఇవి తీసుకురాకూడదు..

విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, పెన్ను, పెన్సిల్, గ్రాఫ్ గీసేందుకు అవసరమైన సామగ్రి మినహా సెల్‌ఫోన్ సహా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదు.

పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పి రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి, ఒంగోలు



జిల్లాలో ఆరు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాం. వీటిలో సిట్టింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ ఉంటుంది. మొత్తం 30 సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశాం. ఎక్కువ మంది ఎస్‌జిటిలు ఇన్విజిలేటర్లుగా ఉంటారు. కేంద్రంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ త్రిపురాంతకం మండల పరిధిలోని దూపాడు, గొల్లపల్లి, వెల్లంపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ 12 డిమాండ్లతో చలో ఢిల్లీ కార్మికమానికి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, కౌలు రైతు సంఘాలు సంఘాలు పిలుపునిచ్చినట్లు తెలిపారు.. అధిక ధరలను అరికట్టి, ఆహార నిత్యావసరాలపై జిఎస్‌టిని సవరించాలని, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ఎక్సైజ్ పన్ను తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను అందుబాటులో తెచ్చి 14 రకాల నిత్యవసర సరుకులు సరఫరా చేయాలని, అందరికీ గృమ సౌకర్యం కల్పించాలనే తదితర డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట్ల నాగిరెడ్డి, మల్లిఖార్జున, దూదేకుల సిద్దయ్య, బద్దిక వెంకటరెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు. **కొండపి :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిం చేందుకు ఈనెల 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కెజి. మస్తాన్ కోరారు. చలో ఢిల్లీ కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని మూగ చింతల, నెన్నూరు పాడు, ముప్పరాజుపాలెం గ్రామాల్లో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. గ్యాస్ , నిత్యవసర వస్తువులు ధరలు పెరగటంతో పేదల జీవనం కష్టంగా మారినట్లు తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



కొండపిలో కూలీలతో మాట్లాడుతున్న కెజి.మస్తాన్

ప్రభుత్వ పథకాలను

సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కంభం రూరల్

ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు. స్థానిక వాసవీ విద్యా సంస్థల ఆవరణలో వైఎస్ఆర్ మూడో విడత ఆసరా చెక్కులను డ్వాక్రా మహిళలకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి దాన్ని నిలబెట్టుకోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం, అర్ధవీడు బేస్తవారిపేట మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. **నాగులుప్పపాడు :** మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు సంతనూతలపాడు ఎస్ఐ టిజెఆర్. సుధాకర్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని అమ్మనబ్రోలు గ్రామంలో డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని 1,733 గ్రూపులకు చెందిన 17,345 మంది డ్వాక్రా మహిళలకు రూ.13.59 కోట్ల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నలమలపు అంజమ్మ, సర్పంచి బత్తుల రవీణ, వైసిపి నాయకులు మారెళ్ల బంగారుబాబు, నలమలపు కష్ణారెడ్డి, కంచర్ల సుధాకర్, పి. పరందామారెడ్డి, కోయి హనుమయ్య, పేరాల చెన్నకేశవులు,.శ్రీమన్నారాయణ, కె.త్రినాధ్‌రెడ్డి, ఇనగంటి వెంకట రమణారెడ్డి, దశరధ, రంగారావు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు



బండలాగుతున్న ఎడ్ల జత

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి- దొనకొండ

మండల పరిధిలోని కొచ్చెర్లకోట గ్రామంలో శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్ళ సందర్భంగా ఆదివారం రాష్ట్ర స్థాయిలో ఎడ్లకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలు ఉత్రహంగా సాగాయి. ఈ పోటీల్లో గిద్దలూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన మీనిగ కాశయ్య ఎడ్ల జత 2,757 అడుగులు లాగి ప్రథమ బహుమతిగా రూ.50 వేల నగదును కైవసం చేసుకున్నాయి. బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగ శివశంకర్ ఎడ్ల జత 2,706 అడుగులు లాగి ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ మండలం శ్రీనివాసపురం కాలనీకి చెందిన సప్పిలి అంజిరెడ్డి ఎడ్ల జత 2, 600 అడుగులు లాగి తృతీయ బహుమతిగా రూ.20 వేలు, దర్శి మండలం దర్శి గ్రామానికి చెందిన గానుగపంట రాజశేఖరరెడ్డి ఎడ్ల జత 2,304 అడుగులు లాగి నాల్గవ బహుమతిగా రూ.10 వేల నగదును కైవసం చేసుకున్నాయి. దాతలు గాజులపల్లి నాగిరెడ్డి, నాగార్జునరెడ్డి, జాజుల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపిపి వడ్లమూడి వెంకటేశ్వర్లు, రామిరెడ్డి కలికిరెడ్డి సహకారంతో విజేతలకు బహుమతులు అందజేశారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కురిచేడు

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అన్నెం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యు. మాధవరావు, గౌరవ అధ్యక్షుడిగా షేక్ ఖాదర్ వలి, అసోసియేట్ అధ్యక్షుడిగా డి. జాన్ బాబు, మహిళా సహ అధ్యక్షురాలిగా కె. హిల్డా నైటింగేల్, కోశాధికారిగా ఎం. శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లుగా ఎం. గౌస్ బాషా, షేక్ అల్లాబకాష్ మీరా, ఆర్. శ్రీనివాసరెడ్డి, జి. విక్రంబాబు, ఎం. ఉదయ భాస్కర్, షేక్. మస్తాన్ వలి, జి. సుజాత ఎన్నికయ్యారు.



ఈద్గాలో మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఈద్గాలో మరమ్మతు పనులు

ప్రజాశక్తి- కురిచేడు

కురిచేడులోని ముస్లింల ఈద్గా వద్ద సమస్యలు చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంగా ముస్లింలు ఈద్గా వద్దే నమాజ్ చేస్తారు. ఆ సమ యంలో తాత్కాలికంగా మరమ్మతలు చేపట్టి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. ఈనేపథ్యంలో కురిచేడు జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి చొరవతో ముస్లింలు సమస్యను జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన బూచేపల్లి వెంకాయమ్మ జిల్లా పరిషత్ నిధుల నుంచి ఈద్గా మరమ్మతుల కోసం రూ. 10 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులు ముస్లింలు ఈద్గాకు మరమ్మతులు చేపట్టారు. అడిగిన వెంటనే ఈద్గా మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరు చేసిన జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, అందుకు సహకరించి కురిచేడు జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం

తర్లుపాడు : మండల పరిధిలోని కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2002-03 విద్యా సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు అప్పటో తమకు చదువు చెప్పిన గురువులను గుర్తుపెట్టుకొని ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథం, రామకష్ణ, ఆంజనేయప్రసాద్, చెన్నారెడ్డి, రామారావు, పద్మనాభిరెడ్డి, పిచ్చయ్య, పద్మజ, రమాదేవి, శివారెడ్డి, పూర్వ విద్యార్థులు టి.పీరారెడ్డి, కె.మహేష్, వెన్నా కాశిశ్వర్‌రెడ్డి, పి.రామచంద్రారెడ్డి,గురునాథం, బి.అనంతరెడ్డి, బి.యోహాన్, కె.మరియదాసు, పి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం

కొండపి : కొండపి గ్రామానికి చెందిన లేళ్ల శ్రీనవాసరావు కుమారుడు మణికంఠ, హారికల వివాహ రిసెప్షన్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ మేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. నూతన దంపతులను ఆశీర్వదించిన వారిలో టిడిపి సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్య చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమంద నాయుడు, బత్తుల నారాయణ స్వామి, నరసరెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, దామా మురళి ఉన్నారు. వైసిపి మండల అధ్యఉడు గోగినేని వెంకటేశ్వర్లు,వైసిపి నాయకులు వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

గాదెపాలెంలో పంట కోతప్రయోగం

కొత్తపట్నం : మండల పరిధిలోని గాదెపాలెం గ్రామంలో రైతు సాధికార సంస్థ, ఎపి కమ్యూనిటీ నేచురల్ పార్మింగ్ ఆధ్వర్యంలో గుత్తి కొండ ఝాన్సీ లక్ష్మి, చేజర్ల సుజాత అనే మహిళా రైతులు ప్రకతి వ్యవసాయం విధానంలో శనగ పంటను సాగు చేశారు. పంటలో అంతర పంటలుగా అవాలు, ధనియాలు, సరి హద్దు పంటగా జొన్నను సాగు చేశారు. గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ చరిత ,కరిముల్లా ఆధ్వర్యంలో ఆదివారం పంట కొత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ నరసింహులు, రెడ్డిప్ప, రామారావు , పద్మావతి,పాల్గొన్నారు.

రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు

సంతనూతల పాడురూరల్ : మండల పరిధిలోని గుమ్మళంపాడు గ్రామ సమీపంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి 58వ వార్షికోత్సవ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి, శాండిల్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా వైసిపి ఆధ్వరంలో ఒకటి, టిడిపి ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. .ఒంగోలు రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంతనూతలపాడు ఎస్ఐ శ్రీకాంత్, ఒంగోలు తాలూకా ఎస్ఐలు సురేష్, చెంచయ్య బందోబస్తు నిర్వహించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి సమాజం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

మహిళలకు చీరలు పంపిణీ

మార్కాపురం : మార్కాపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న 200 మంది మహిళలకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చీరలు పంపిణీ చేశారు. పువ్వాడ రవిశంకర్, దుర్గాదేవి ఆర్థిక సాయంతో చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు సముద్రాల రమేష్, కార్యదర్శి గార్లపాటి రామకృష్ణ, కోశాధికారి కాకుమాను కిశోర్, ఊటుకూరి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న గౌడ్‌కు నివాళి

ప్రజాశక్తి-మార్కాపురం

బడుగులకు అండగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిలిచారని గౌడ సంఘం నేతలు కొనియాడారు. పాపన్న గౌడ్ 323వ వర్ధంతి వేడుకలు స్థానిక సాయితేజ కంటి వైద్యశాలలో ఆదివారం నిర్వహించారు. తొలుత పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు గజ్జ రమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం గౌరవాధ్యక్షుడు ఇల్లూరి రంగస్వామి గౌడ్ మాట్లాడుతూ బడుగులకు రాజ్యాధికారం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఎనలేని కృషి చేశారన్నారు. నైజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాటాలు చేశా రన్నారు. నవాబులకు చెందిన 32 కోటలను ఆక్రమించి తొలి బహుజన రాజుగా సర్దార్



నివాళులర్పిస్తున్న నాయకులు

సర్వాయి పాపన్న గౌడ్ పేరు సంపాదించు కున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల నాగార్జున గౌడ్, మాదాసు రంగనాయకులు గౌడ్, కంచర్ల వెంకటేశ్వర్లు గౌడ్, కొమర వెంకట నరసింహారావు గౌడ్, జూపల్లి వెంకటరావు గౌడ్, దొంత కష్ణ గౌడ్, గజ్జ వెంకటేశ్వర్లు గౌడ్, గుడ్ల వెంకటేశ్వర్లు గౌడ్, గజ్జ రంగారావు గౌడ్, గజ్జ శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను వంచించిన వైసిపి

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

పజాశక్తి-కొండపి

నిరుద్యోగులు, యువతను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వంచించినట్లు కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతీ యువ కులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం పట్టించుకోవడం లేదని తెలిపారు. రాష్ట్రంలో 2.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. వాటిని భర్తీ చేయలేదని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతీ యువకులు నిరుద్యోగ భృతి కింద నెలకు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

రూ. 2వేలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్యచౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు, నాయకులు బత్తుల నారాయణస్వామి, నరస్సారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, దామా మురళి తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి నాటిక పోటీలు

ప్రజాశక్తి-దర్శి

దర్శనాపురి నాటకళాపరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో దర్శిలో ఈనెల 19 నుంచి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నాటక కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు కలవకొలను అనంత్, అంబటి సుబ్బారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జడ్‌పి చైర్‌పర్సన్ వెంకాయమ్మ సౌజన్యంతో నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాటిక పోటీలు సినీరంగ ప్రముఖులు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి



వివరాలు వెల్లడిస్తున్న నాటక కళాపరిషత్ సభ్యులు

శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించనున్నటు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. జైహింద్ రెడ్డి, సభ్యులు మార్తల వెంకటేశ్వరరెడ్డి, మోషే, నాగేశ్వరరావు, గాలయ్య, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు

ప్రజాశక్తి-చీమకుర్తి

తథాగత్ బోధిధర్మ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మండలస్థాయిలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు పోటీలు నిర్వహించారు. స్థానిక బూచేపల్లి కల్యాణ మండపంలో అకాడమీ ఎగ్జామినర్ దేవరకొండ వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బి.శ్రావణ్, లోకేష్, దీప్తి,సింధు ఎల్లో బెల్ట్ సాధించారు. గౌతమ్, వరుణ్, కోస్త్రే, మధు, జ్ఞానేశ్వర్, నాగేశ్వరరావు, నిహారిక, లక్ష్మి, సాయి,లోకేష్, కార్తీక్ ఆరెంజ్ బెల్ట్ సాధించారు. ఈ



విద్యార్థులకు కరాటే బెల్టులు అందజేస్తున్న వెంకటేష్

కార్యక్రమంలో కరాటే మాస్టార్ సుధాకర్, శివం పౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ముండ్లమూరు

పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఇఒ చంద్రమోహన్ తెలిపారు. ముండ్లమూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 150 మంది, ఎపి మోడల్ స్కూల్‌లో 190 మంది, కెజిబివిలో 100మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. **పొన్నలూరు :** పొన్నలూరు జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విప్పగుంట్ల హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎఇఒ రవిచంద్రబాబు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. **కొండపి :** పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఇఒ సురేఖ తెలిపారు. మండలంలో మొత్తం 562 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు. నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కొండపి సిఐ మాతంగి శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతి పరీక్షాల కేంద్రాలను సిఐ, ఎస్ఐ వైవి. రమణయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. **శింగరాయకొండ :** మండలంలో 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ శివన్నారాయణ తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్‌లో పరీక్షల నిర్వహణపై ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మండలంలో పదో తరగతి పరీక్షలకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నాలుగు కేంద్రాల్లో మొత్తం 800 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుంపా భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** పదవ తరగతి పరీక్షా కేంద్రాల గట్టిబందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ జి. కోటయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. **పెద్దదోర్నాల :** పదో తరగతి పరీక్షా కేంద్రాల పటిష్ట బందోబస్తే ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకోనున్నటు ఆయన తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ ఎస్తాన్ నాయక్ తెలిపారు. మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 560 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. **పిసిపల్లి :** నేటి నుంచి నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసిటన్లు పిసిపల్లి జడ్‌పి హైస్కూల్ ప్రధానో పాధ్యాయుడు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసులు తెలిపారు. పిసిపల్లిలో జడ్‌పి హైస్కూల్, జిజెసి, కెజిబివిలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిసిపల్లి మండల పరిధిలోని విద్యార్థులతో పాటు కనిగిరి మండలం కొత్తఎరువారిపల్లి హైస్కూల్ విద్యార్థులు కూడా ఇక్కడే పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం 412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. **దర్శి :** పదోతరగతి పరీక్ష కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మాస్‌కాపింగ్ జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఏడు కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ కాకర్ల రఘురామయ్య తెలిపారు. పభుత్వ ఉన్నత పాఠశాలలో 230 మంది, సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో 160 మంది, పిఆర్‌కెఆర్ గౌతమి స్కూల్‌లో 230 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 160 మంది, గురుకుల బాలుర స్కూల్‌లో 190 మంది, గౌతమి బిఇడి కాలేజిలో 230 మంది, ఎపి మోడల్ స్కూల్‌లో 190 మంది కలిపి మొత్తం 1330 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఇఒ తెలిపారు. **పొదిలి :** పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ రాఘవేంద్రరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. **సంతనూతలపాడురూరల్ :** పదోతరగతి పరీక్షలకు మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ సనత్ కుమార్ తెలిపారు. మొత్తం 1,160 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. **నాగులుప్పలపాడు :** పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ మహబూబ్ సుభానీ తెలిపారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరులో రెండు, అమ్మనబ్రోలు రెండు, నిడమానూరులో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మొత్తం 743 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు ఎంఇఒ తెలిపారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు.

జగన్‌ది అసమర్థ పాలన

- ప్రశ్నార్థకంగా యువత భవిష్యత్తు
- టిడిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు

ప్రజాశక్తి-అద్దంకి

అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతి ఏటా జనవరి 1న జ్యాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసంచేశారని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన విడుదల చేశారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక యువత భవిత ప్రశ్నార్థకంగా మారింది అని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి వెల్లడించారని, ఇది వైసీపీ చేతకాని పాలనకు నిదర్శనమని అన్నారు. సిఎంఐఇ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2019 ఏప్రిల్ నాటికి 4.0 శాతం ఉన్న నిరుద్యోగం డిసెంబర్ 2022 నాటికి 7.7 శాతానికి పెరిగిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ 5 ఏళ్ల పాలనలో పరిశ్రమల ద్వారా 5.13 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని వైసిపి మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారని గుర్తుచేశారు. కానీ నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కమీషన్ల కక్కుర్తితో మూడున్నరేళ్లలో రూ.17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల మంది యువత ఉపాధికి గండికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో 2సార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల ఉద్యోగాలిచ్చారని, కానీ ప్రతి ఏటా మెగా డీఎస్సీ అన్న జగన్ రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగమూ భర్తీ చేయలేదని తెలిపారు. ఐటి అభివృద్ధితో 34 వేల ఉద్యోగాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 64,000 ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. జగన్‌రెడ్డి ఐటి కంపెనీలు తరిమేసి, అక్రమ కేసులతో స్కిల్ డెవలప్‌మెంట్‌ను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు ప్రతినెలా 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి (ముఖ్యమంత్రి యువనేస్తం) ద్వారా అందించారని జగన్‌రెడ్డి దాన్ని రద్దు చేశారన్నారు. జగన్ పాలనలో గంజాయి అక్రమ రవాణాలో ఏపీ నెంబర్1 స్థానంలో ఉందని ఎన్సీబీ (నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో) నివేదిక చెబుతోందని, ఇందుకు వైసిపి ప్రభుత్వం సిగ్గుపడాలని ఆయన అన్నారు. రాబోయేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.



గొట్టిపాటి రవికుమార్

యర్రగొండపాలెం: అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారని యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ధ్వజమెత్తారు. ఆదివారం యర్రగొండపాలెంలోని టిడిపి



యర్రగొండపాలెంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పారని గుర్తు చేశారు. ఈ నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కమీషన్ల కక్కుర్తితో మూడున్నరేళ్లలో 17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల మంది యువత ఉపాధికి గండి కొట్టారని ఆరోపించారు. అమరావతి నిర్మాణంతో 15 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడితే జగన్ రెడ్డి అమరావతిని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రతి ఏటా మెగా డీఎస్సీ అన్న జగన్‌రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదన్నారు. 25 మంది ఎంపీలనిస్తే కేంద్రం మెడలు వంచి సాధిస్తానన్న ప్రత్యేక హోదా ఏమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, పుల్లలచెరువు మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, నాయకులు గురిజేపల్లి జిలాని, షేక్ వలి, షేక్ ఇస్మాయిల్, కంచర్ల సత్యనారాయణగౌడ్, తోటా మహేష్‌నాయుడు, మహమ్మద్ రఫీ, భాస్కర్, చేదూరి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు: గత వారం ముగిసిన గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్‌లో ఫేక్ పెట్టుబడులతో మోసం చేసిన ప్రభుత్వం ఇప్పుడు బడ్జెట్ కేటాయింపుల్లో కూడా అంకెల గారడీతో రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం వాటిని తరిమేసిందని, జాబ్ క్యాలెండర్ ద్వారా 2లక్షల 30 వేల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పిన జగన్‌రెడ్డి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. తెలుగుదేశం హయాంలో 2018 -19లో గ్రోత్ రేట్ 32.1 శాతంగా ఉంటే, వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ సంఖ్య 2021-22 నాటికీ, మైనస్ 10.4 శాతానికి పడిపోయిందన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో ఏపీలో విదేశీ పెట్టుబడులు అధికంగా ఉంటే, నేడు ఏపీలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు కరువయ్యారన్నారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వ ధోరణి మారలేదని, ఉద్యోగాల కల్పన ఊసే లేదన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రంలోని



గిద్దలూరులో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి

అన్నీ వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని, రాష్ట్రంలో జగన్‌రెడ్డి ప్రభుత్వం అంకెల గారడీతో ఎన్నో రోజులు తప్పించుకోలేదని, రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపల్లె: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థ పాలనతో ఆంధ్రప్రదేశ్ అప్పులతో నిండిపోయిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు గూడపాటి శ్రీనివాసరావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత యువత ఉపాధి అవకాశాలు కోల్పోయారని అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి నేడు వాలంటీర్ పోస్టులతో సరిపెట్టారని విమర్శించారు. అర్హతకు తగిన ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఐటి కంపెనీలను తరిమేసి, ఒక్క కొత్త కంపెనీ కూడా తీసుకురాని అసమర్థ ప్రభుత్వం అన్నారు. అరాచకం, కక్ష సాధింపు తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది లేదన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సి, ఎస్టీ, బిసి, కాపు, మైనార్టీ, కార్పొరేషన్ల ద్వారా యువతకు పెద్దఎత్తున రుణాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డిది అన్నారు. సంక్షేమ పథకాల పేరుతో పేదలకు చిల్లరవేస్తూ రాష్ట్రాన్ని గంజాయి, జూద క్రీడలు, మాదక ద్రవ్యాలకు అడ్డాగా మార్చి పెద్దఎత్తున దోచుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జివి నాగేశ్వరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ అన్నే రామకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర నాయకులు

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల సిబిజెడ్ చర్చ్ పర్యవేక్షణలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాపట్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబిజెడ్ ఛర్చి పాస్టర్ రాహుల్ దేవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొరుగు వారిని ప్రేమించు అనే ఏసుక్రీస్తు బోధనలను పాటిస్తూ సమాధాన సత్యమయ్య జీవితాన్ని గడపాలని కోరారు. కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ జె రత్నకుమార్, టి ప్రేమ్‌చంద్, జె క్రిష్టఫర్, జి జాన్సన్, జెఎస్ హెర్బర్ట్, సండే స్కూల్ విద్యార్థులు, సంఘకాపరులు, సంఘ పెద్దలు, యువజనులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పంగులూరు క్రైస్తవపాలెంలో మట్టల ఆదివారం దృశ్యం

పంగులూరు: మట్టల ఆదివారం పండుగను ఆదివారం పంగులూరులోని క్రైస్తవ పాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలకు పూలను గుచ్చి, పిల్లలు, పెద్దలు చేత పట్టుకొని వీధులలో క్రైస్తవ భక్తి పాటలు పాడుతూ ర్యాలీ చేపట్టారు. ఈసీఐ సంఘ కాపరి పి రవి రాజు మట్ల ఆదివారం గురించి పిల్లలకు, క్రైస్తవులకు వివరించి చెప్పారు. యూదుల రాజుకు జై, దావీదు తనయునికి జై, అంటూ క్రీస్తుకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పాస్టర్ పసికర్ల ఏలియా, సంఘపెద్ద పాలపర్తి సింగయ్య, పరిమి ప్రసన్న, సునీత, పాలపర్తి నవనీతం, పాలపర్తి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.



పిట్టలవానిపాలెంలో మట్టల ఆదివారం

పిట్టలవానిపాలెం: మండలంలోని పలు చర్చిలలో ఆదివారం రోజును మట్టల ఆదివారంగా ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పాతరెడ్డిపాలెం సంఘ కాపరి రెవరెండ్ ముద్దు బాబురావు ఆధ్వర్యంలో ఈత మట్టలను పూలతో అలంకరించి వాడవాడలా భక్తి గీతాలను ఆలపిస్తూ శాంతి ర్యాలీ చేపట్టారు. స్థానిక వీధుల్లో క్రీస్తుకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక ఆరాధన చేపట్టారు. చిన్నారులకు సంఘ కాపరి మట్టల ఆదివారం విశిష్టతను గురించి వాక్య సందేశం ఇచ్చారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పర్చూరు

నేటి నుంచి జరుగనున్న పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు మండలంలో 4 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు. 643 మంది రెగ్యులర్ విద్యార్థులు, ఇద్దరు ప్రైవేటు విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఏ ఒక్క విద్యార్థి కూడా కింద కూర్చోకుండా బెంచీల ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 6 పేపర్లు రోజు మార్చి రోజు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రశ్నపత్రాలు 100 మార్కులకు ఉంటాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించడంతో పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని స్కూళ్లలోనూ పోలీస్ శాఖ తరపు నుంచి పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షలు అయిపోయేంతవరకు ఎలాంటి మాస్ కాపీయింగ్, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్చూరు ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ పరీక్షలు నిర్వహిస్తున్న సెంటర్లను తన సిబ్బందితో కలిసి వెళ్లి పూర్తిగా పరిశీలించి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని వివరించారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్స్ కానీ, స్మార్ట్ వాచెస్ గాని ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు గాని అనుమతి లేదన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులకు కూడా లోపలికి అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటించాలని, విద్యార్థులు పరీక్ష రాసేటప్పుడు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా రాయాలని తెలిపారు.

నవమి వేడుకల్లో అన్నసంతర్పణ

ప్రజాశక్తి-బాపట్ల

శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బాపట్ల పట్టణం భీమా వారిపాలెం కోదండ రామాలయంలో ఆదివారం అన్నసంతర్పణ కార్య క్రమం నిర్వహించారు. అన్నదానాన్ని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ప్రారంభించారు. రామాలయ కమిటీ నాయకులు లేళ్ల నరేంద్రనాథ్, రౌతు రామాంజనేయులు, భీమా రాము, లేళ్ల శ్రీను, భీమా నరసింహారావు, జిట్టా ప్రమిలా రాణి, జిట్టా శ్రీనివాసరావు, లేళ్ల వెంకటప్పయ్య, విన్నకోట సత్యప్రసాద్ పాల్గొన్నారు.



అన్న సంతర్పణ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్



తోపుడు బండ్లు అందిస్తున్న రోటరీ సభ్యులు

చిరు వ్యాపారులకు రోటరీ చేయూత

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రోటరీ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని చిరు వ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్ష కార్యదర్శులు కొర్రపాటి కాజారావు, కుర్రా వెంకటరామయ్య పిలుపు ఇచ్చారు. ఆదివారం స్థానిక ఎఫర్ట్ కార్యాలయం ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ డెక్కన్ హైదరాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారి సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో చిరు వ్యాపారుల ఆర్థిక స్వావలంబన కోసం రోటరీ చేయూత చక్రాల పథకం కింద 8 మందికి తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి జాస్తి వెంకట మోహనరావు, 2023-24 ఎలక్ట్ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు. మాజీ అధ్యక్షులు సిహెచ్ బసవ రాములు, జాష్టి సాంబశివరావు, రావి అంకమ్మ చౌదరి, కాజా హుస్సేన్, మురకొండ ఈశ్వర ప్రసాద్, గుండవరపు ప్రసాద్, చెరుకూరి నాగేశ్వరరావు, జి వెంకటేశ్వరరావు, కందిమళ్ల రవిబాబు, చింతల సుబ్బారావు, గాలి గంగాధర్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?

'గడపగడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం నగరంలోని 32వ డివిజన్ గద్దలగుంట గాంధీబొమ్మ ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా..? లేదా..? అని ఆరాతీశారు. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితో ఆయన మాట్లాడారు. బాలినేని వెంట మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, స్థానిక కార్పొరేటర్ తాడి కృష్ణలత, వైసిపి నాయకులు కోసూరి శేఖర్, ఓగిరాల వెంకట్రావు, తోటపల్లి సోమశేఖర్, తోటపల్లి వెంకటేష్, కటారి శంకర్, బొమ్మినేని మురళి, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, ఎసిపి కె.వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ బాబ్జీ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న బాలినేని

కార్పొరేటర్‌కు శుభాకాంక్షలు..

32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత పుట్టినరోజు సందర్భంగా ఆదివారం గద్దలగుంటలో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గాంధీబొమ్మసెంటర్, రామాలయం సెంటర్‌లలో కృష్ణలత పుట్టినరోజు సందర్భంగా యువకులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని జూమ్ మీటింగ్ ద్వారా ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం జిల్లా స్థాయిలో పలు కార్యకలాపాలు చేపట్టనుంది. పిహెచ్‌సి వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులుగా డాక్టర్ కె.రాహుల్ (పూసలపాడు), ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఒ.నారియల్(నాగులుప్పలపాడు), డాక్టర్ కె.సరస్వతి(జరుగుమల్లి), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బంకా రత్నం(తూర్పు గంగవరం) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ వి.జ్యోతి(ముండ్లమూరు), డాక్టర్ పి.ప్రవీణ్ (కురిచేడు), డాక్టర్ కాజ నాయబ్‌రసూల్ (కెఎస్‌పల్లి), పబ్లిసిటీ కార్యదర్శిగా డాక్టర్ ఎం.సుందరప్రసాద్(కరవది), కోశాధికారిగా డాక్టర్ ఎం.రమేష్ కుమార్(గరిజెలగుల్ల), కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ సిహెచ్ చైతన్య దీపక్(కొమరోలు), డాక్టర్ ఎస్‌కె.అక్తర్ రసూల్ (తురిమెళ్ళ), డాక్టర్ కె.శ్రీధర్ రెడ్డి(జరుగుమల్లి), డాక్టర్ కె.రజిత మానస(టిహెచ్ వార్డు, ఒంగోలు), డాక్టర్ బి.కిరణ్మయి(చందలూరు), డాక్టర్ ఎన్.నాగరాజ్యలక్ష్మి(పిసిపల్లి) ఎన్నికయ్యారు.

పొదిలిలో వర్షం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కూడా ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటపాటు మండలంలోని పలు గ్రామాలలో పిడుగులు పడ్డాయి. వర్షం కారణంగా పట్టణంలోని ప్రధాన రహదారిపై వర్షపు నీటితో మురుగు నీరు చేరడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

పిసిపల్లి: మండలంలోని జంగాలపల్లి, పిసిపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ గాలులకు జంగాలపల్లిలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. తుమ్మచెట్లు నేలకొరిగాయి. జంగాలపల్లికి వెళ్లే దారిలో మారేళ్ళ చెరువు కట్టమీద తుమ్మచెట్టు విరిగి కట్టపై పడ్డాయి. దీంతో జంగాలపల్లికి వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

4 నుంచి హరిహరక్షేత్రం వార్షికోత్సవం

ప్రజాశక్తి-చీమకుర్తి

హరిహరక్షేత్రం 17వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల నాలుగో తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ హరిహరక్షేత్రం ప్రతిష్ఠించి 16 ఏళ్ళు పూర్తి చేసుకొని 17వ ఏడాదిలోకి అడుగుపెట్టిందన్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామిల పర్యవేక్షణలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమాలలో వివిధ ఆలయాల ఆస్థాన పండితులు, అధికారులు, వేదపండితులు పాల్గొంటారన్నారు. రెండు రోజుల పాటు హెూమాలు, విశేష పూజలు, మహా పడిపూజ, మహా పూర్ణాహుతి, నగరోత్సవం, శాంతి కల్యాణం నిర్వహిస్తారని.. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ఉపాధి లేక

ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువత

టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

ఉపాధి లేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలియజేశారు. కనిగిరి అమరావతి గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక గంజాయి, డ్రగ్స్‌కు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. 6 లక్షల మంది యువతకు రూ.2 వేల చొప్పున గత చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగభృతిని ఇవ్వగా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. టిడిపి హయాంలో డిఎస్సీల ద్వారా 18 వేల ఉద్యోగాలు ఇవ్వగా ఈ ప్రభుత్వం ఇంతవరకు డిఎస్సీ నిర్వహించకుండా యువతకు నమ్మక ద్రోహం చేసిందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

రాజకీయ చైతన్యంతో ముందుకు..

చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జునరావు

ప్రజాశక్తి-చీరాల: చేనేతలను చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వాలు చరిత్ర ద్రోహులుగా మిగిలిపోతాయని చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జునరావు అన్నారు. చేనేత సమస్యలను గుర్తించేందుకు ఆదివారం నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక గడియార స్తంభం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మల్లికార్జునరావు మాట్లా డారు. రాష్ట్ర జనాభాలో చేనేతల సంఖ్య కోటి పైగా ఉందని, రాబోయే ఎన్నికల్లో స్వతంత్రంగా పార్టీని స్థాపించి తమ సత్తా చాటుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రామచంద్ర, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, పురుషోత్తం, నారాయణ, గిరిధర్, తారకరామారావు, రంగారావు, సాధు లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆ పరీక్షపై గందరగోళం.!

- ఫిజిక్స్, ఎన్ఎస్ పరీక్షపై పదోతరగతి విద్యార్థుల ఆందోళన
- ఒక పేపర్ రాశాకే రెండో పేపర్ రాస్తే మేలంటున్న ఉపాధ్యాయులు
- ప్రతి 15 నిమిషాలకోసారి గుర్తు చేయాలనే ఆదేశం అమలయ్యేనా.?

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పదోతరగతి విద్యార్థులకు ఫిజిక్స్, ఎన్ఎస్ పరీక్షపై గందరగోళం, ఆందోళన నెలకొంది. ఈ పరీక్ష నిర్వహణపై అటు ఉపాధ్యాయుల్లోనూ, ఇటు విద్యార్థుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక పేపర్ రాశాకే రెండో పేపర్ రాస్తే ఉపయోగకరమని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో ఎక్కువ మంది విద్యార్థులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి 15 నిమిషాలకోసారి విద్యార్థులకు దీనిపై గుర్తు చేయాలని ఇన్విజిలేటర్లకు విద్యాశాఖ నుంచి ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలొచ్చాయి. ఇది ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు 582 ఉన్నాయి. అధికారులు 175 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 28,902 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పరీక్షల్లో గతేడాది ఏడు పేపర్లు పెట్టగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో వాటిని ఆరింటికే కుదించి పరీక్షలు నిర్వహించేలా మార్పులు తీసుకొచ్చారు. ఈ ఏడాది ఫిజిక్స్, నేచురల్ సైన్స్ (ఎన్ఎస్)కు వేర్వేరుగా ప్రశ్నపత్రాలు, వేర్వేరుగా ఆన్సర్ బుక్‌లెట్లు ఇస్తారు. దీనిపైనే ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరీక్షకు సంబంధించి ఇప్పటికే నిర్వహించిన ప్రీ పబ్లిక్ పరీక్షల్లో ప్రాక్టీస్ చేయించినా చాలా స్కూళ్లల్లో విద్యార్థులు ఫిజిక్స్ ఆన్సర్ బుక్‌లెట్‌లో ఎన్ఎస్ ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు రాశారు. పబ్లిక్ పరీక్షల్లో ఇదే పునరావృతమైతే అంతిమంగా విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. రెండు ప్రశ్నాపత్రాలు, రెండు ఆన్సర్ బుక్‌లెట్లు ఒకేసారి ఇస్తారు. దీంతో విద్యార్థులు వారికి ఏ పేపర్ తేలిగ్గా ఉందో, దాన్ని ముందుగా రాసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే జవాబులు వేర్వేరు ఆన్సర్‌షీట్లపై రాయాల్సి ఉంది. దీంతో వాటిని రాసే క్రమంలో పొరపాటున ఒక దానిపై రాయాల్సింది మరో దానిపై రాస్తే విద్యార్థులకు నష్టం జరుగుతుందని, వేర్వేరుగా కాకుండా ఒకే ఆన్సర్ బుక్‌లెట్‌లో సమాధానాలు రాసేలా వెసులుబాటు కల్పించాలని ఇప్పటికే ఉపాధ్యాయులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే వారి నుంచి ఎటువంటి స్పందనా లేదు.

సీరియల్ నంబరు వేర్వేరుగానే సీరియల్ నెంబరు ఒకటి నుంచి 16 వరకు ఫిజిక్స్, 17 నుంచి 33వ ప్రశ్న వరకూ ఎన్ఎస్ సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. పొరపాటున 17వ నంబరు ప్రశ్నకు ఫిజిక్స్ సమాధాన పత్రంలో రాస్తే ఆ మేరకు ఇన్వాలిడ్‌గా పరిగణిస్తారు. ఇది లేకుండా ఉండాలంటే 1 నుంచి 16 దాకా ఫిజిక్స్ ప్రశ్నావళికి ఆ ఆన్సర్ బుక్‌లెట్‌పైనే రాయాలి. ఎన్ఎస్‌కు కేటాయించిన 17 నుంచి 33 నెంబర్ల వరకూ సంబంధిత ఆన్సర్ షీట్‌పై సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు పరీక్ష రాసే సమయంలో తడబడి ఒకదాని బదులు మరో ఆన్సర్ షీట్‌లో సమాధానాలు రాస్తే ఆయా సబ్జెక్టుల్లో ఫెయిలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

పారదర్శకంగా 'పది' పరీక్షల నిర్వహణ

- నేటి నుంచి 18వ తేదీ వరకు..
- హాజరు కానున్న 28,902 విద్యార్థులు
- పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన
- జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ వెల్లడి



ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పదోతరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ పేర్కొన్నారు. జిల్లాలో పదోతరగతి పరీక్షలు ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలకు మొత్తం 28,902 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామని, పిల్లలు ఎవరూ నేలపై కూర్చొని పరీక్ష రాయకుండా చర్యలు చేపట్టామన్నారు. పదోతరగతి పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను డిఇఒ 'ప్రజాశక్తి'కి వివరించారు.

జిల్లాలో పదోతరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ గతంలో అన్ని విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహించి.. పలు సూచనలు చేశారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశాం. ఈ పరీక్షల కోసం 175 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇందులో ఏ కేటగిరి పరీక్షా కేంద్రాలు 65, బి కేటగిరి కేంద్రాలు 73, సి కేటగిరి పరీక్షా కేంద్రాలు 37 ఉన్నాయి. అన్ని కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాం.

28,902 మంది..

పరీక్షలను మొత్తం 28,902 మంది విద్యార్థులు రాయ నున్నారని, వీరిలో బాలురు 14,830 మంది, బాలికలు 14072 మంది ఉన్నారన్నారు.

1600 మంది ఇన్విజిలేటర్ల నియామకం

పదోతరగతి పరీక్షల కోసం 1600 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశాం. అలాగే 175 చీఫ్ సూపరింటెం డెంట్లు, డిపార్ట్ మెంట్ అధికారులను నియమించాం. పదో తరగతి పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్, 30 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశాం ఆయా పరీక్షా కేంద్రాలలో అవసరమైన ఫర్నీచర్, లైటింగ్, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం.

మొబైల్ ఫోన్లు నిషేధం

విద్యార్థులు ఎవరూ ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాలకు తీసుకు రావటం నిషేధం. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్ల మొబైల్ ఫోన్లను అనుమతించం. పరీక్షా కేంద్రంలో విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత పరీక్షకు అనుమతిస్తాం. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వస్తే 8.45 గంటలకు లోపలకు అనుమతిస్తాం. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతోంది. పరీక్ష కోసం వచ్చే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుంది. విద్యార్థులు వారి హాల్‌టిక్కెట్లను చూపించాలి.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఆయా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. పశ్చిమ ప్రకాశంలోని 37 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. పరీక్షలలో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించిన ఇన్విజిలేటర్లపై యాక్ట్ 25 నమోదు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించి సమీపంలోని జెరాక్స్ సెంటర్లు మూసివేస్తాం..

పకడ్బందీగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఓపెన్, టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నాం. ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 22 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 4912 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఓపెన్ టెన్త్ పరీక్షలకు 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1737 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. అందరి సహకారంతో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.